

1.75 కేజీల గంజాయి స్వాధీనం

1.75 కిలోల గంజాయిని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జరిగింది.

- 8లో..



అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఒంగోలు రెడ్డి హాస్టల్ సమీపంలోని మామిడి పాలెం చెరువులో పడి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29 /21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పింఛన్‌దారులు ధ్రువపత్రాలు సమర్పించాలి

ఒంగోలు అర్బన్: జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి ఏడాది పరిశీలనకు ఇవ్వాల్సిన ధ్రువపత్రాలను సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లను ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు ఉప ఖజానా కార్యాలయంలో భౌతికంగా లేదా జీవన్ ప్రమాణ్ ఆన్‌లైన్ విధానంలో అయినా ధ్రువపత్రాలు సమర్పించవచ్చన్నారు. జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్ దారులు నిర్దేశించిన గడువులోపు సమర్పించి సకాలంలో పింఛన్ మంజూరు చేసేందుకు ఉప ఖజానా అధికారులకు సహకరించాలని తెలిపారు.

6న కంభంలో మెగా జాబ్ మేళా

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్ జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేస్తారని, ఇందులో పలు రకాల కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు 8639560207, 8008822821 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అర్బన్ హౌసింగ్ కోసం భూముల పరిశీలన



జగనన్న కాలనీ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టు కోసం ఒంగోలు పరిసర ప్రాంతాల్లోని భూములను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లోని అల్లూరు, మల్లేశ్వరపురం, కరవది, అగ్రహారం, చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డి పాలెంలలో కలెక్టర్ పర్యటించారు. సుమారు 500 ఎకరాల భూమి అవసరం ఉన్నందున ఆ మేరకు భూముల లభ్యతపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. ఆయా భూముల స్థితిగతులు, వాటి మార్కెట్ ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ భూములకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మ్యాపులతో సహా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఆర్డీఓ విశ్వేశ్వరరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు తహసీల్దార్ మురళి, కొత్తపట్నం తహసీల్దార్ రమణారావు, ఇతర అధికారులు ఉన్నారు.



అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య.. ఆ పార్టీ అధినేత దగ్గర నుంచి పార్టీ నాయకుల వరకూ ఒకటే తీరు. నాడేమో కాసుల కోసం కక్కుర్తి పడి..కావల్సిన వారికి కాంట్రాక్ట్ అప్పజెప్పి..పనులు వేగంగా జరుగుతున్నాయని ఆర్భాటంగా ప్రచారాలు చేసుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా వారి తీరు మారలేదు. అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతూనే ఉన్నారు. తాజాగా కొత్తపట్నం వంతెనపై క్షుద్ర రాజకీయానికి తెరతీశారు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్..బకింగ్‌హామ్ కెనాల్ సాక్షిగా ఆయన చేస్తున్న డ్రామా పలు విమర్శలకు తావిస్తోంది.

నాడు కక్కుర్తి..

నేడు హైడ్రామా

మాజీ ఎమ్మెల్యే జనార్దన్ పాలి'ట్రిక్స్'.. మండిపడుతున్న జనం

- బకింగ్‌హాం కెనాల్ వంతెనను అడ్డుపెట్టుకొని నాడు కమీషన్లు దండుకున్న వైనం
- నేడు పనులు పూర్తి కావడం లేదంటూ డ్రామాలు
- బాలినేని హెచ్చరికలతో వేగవంతంగా బ్రిడ్జి పనులు
- పనులు పూర్తవుతాయనే భయంతో బ్రిడ్జి వద్ద ధర్నా అంటూ పనులను అడ్డుకునే యత్నాలు
- ఈనెల 20న ట్రయల్ రన్ వేస్తామంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీ నేతలకు కడుపుమంట పుడుతోంది. అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. నాడు కమీషన్‌లకు కక్కుర్తి పడి సొంత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి కాంట్రాక్టు పనులు అప్పగించారు.. పనులు వేగంగా జరుగుతున్నట్లు బిల్డప్ ఇచ్చారు... ఇతని రాజకీయ డ్రామాలు తెలుసుకున్న ప్రజలు 2019లో జరిగిన ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టారు.. దీంతో నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను అడుగడుగునా అడ్డుకునే కుట్రలు పన్నుతూనే ఉన్నారు. ప్రజలపై ఉన్న కోపమో, బాలినేనిపై అక్కసో తెలియదు గానీ పేదల ఇళ్ల దగ్గర నుంచి ఎన్నో పనులకు అడ్డుపడుతూనే ఉన్నారు. కరోనా కారణంగా సుమారు రెండేళ్లపాటు ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో జనార్దన్ హైదరాబాద్‌కు, బెంగళూరుకు పరిమితమయ్యారు తప్ప, వారి ఇబ్బందిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అదే సమయంలో ఎమ్మెల్యే బాలినేని మాత్రం నిత్యం ప్రజలతో ఉంటూ జీజీహెచ్‌లో వంద పడకలు ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఆక్సిజన్, మందులు, భోజనం ఉచితంగా అందించడమే కాక, నగర ప్రజలందరికీ నిత్యవసర వస్తువులు అందిస్తూ వారితో మమేకమయ్యారు. దీన్ని జీర్ణించుకోలేక దామచర్ల జనార్దన్ అండ్ కో బాలినేనిపై ఎన్నో కుట్రలు, కుయుక్తులు పన్నుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా నేడు ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులోని బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద ధర్నా అంటూ మరో రాజకీయ డ్రామాకు తెరతీశారు. అసలు బ్రిడ్జి నిర్మాణం విషయానికొస్తే జనార్దన్ జేబులు నింపుకోవడానికే దీన్ని ఉపయోగించుకున్నారు తప్ప, ఏనాడు చిత్తశుద్ధితో వ్యవహరించిన దాఖలాలు లేవని కొత్తపట్నంతోపాటు, ఒంగోలు నియోజకవర్గ ప్రజలు మండి పడుతున్న పరిస్థితి. బ్రిడ్జి పనులు చేస్తున్నది తాను అప్పగించి.. తమ సామాజికవర్గానికి చెందిన కాంట్రాక్టర్ అయినప్పటికీ బాలినేనిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తూ విఫలమయ్యారు. తాజాగా మరోసారి బ్రిడ్జి వద్ద ధర్నా అంటూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ ప్రస్తుతం సైతం పనులు చేస్తున్న విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ వద్ద కమీషన్‌లకు దామచర్ల జనార్దన్ కక్కుర్తి పడ్డా..బాలినేని మాత్రం బ్రిడ్జి వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతూ వచ్చారు తప్ప, కాంట్రాక్టర్‌ను ఎక్కడా ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవు. అయితే రాజకీయ కుట్రలో భాగంగా పనులు నత్తనడకన జరుగుతున్నాయని గ్రహించిన బాలినేని పనులు వేగవంతం చేయాలని, లేదంటే చర్యలు తప్పవంటూ కాంట్రాక్టర్‌ను హెచ్చరించడంతో అప్పటి నుంచి పనుల్లో వేగం పెరిగింది. దీన్ని గమనించిన జనార్దన్ త్వరలో పనులు పూర్తవుతాయని తెలుసుకుని రాజకీయ డ్రామాకు తెరతీశారు. బ్రిడ్జి వద్ద ఆందోళన చేపట్టి తన ఆందోళన కారణంగానే పనులు వేగవంతంగా జరుగుతున్నాయనే కలరింగ్ ఇచ్చుకునే కుయుక్తులకు పథక రచన చేస్తున్నారు. కరోనా కారణంగా సుమారు రెండేళ్లపాటు సక్రమంగా పనులు జరగలేదని తెలిసినా బ్రిడ్జిని రాజకీయంగా తన రాజకీయ డ్రామాకు వాడుకునే ప్రయత్నం చేస్తుండటంపై ప్రజలు సైతం ఛీ కొడుతున్నారు. సొంత పార్టీలో ఉన్న అసమ్మతిని పోగొట్టుకునేందుకు ఏవో ఉద్యమాలు చేస్తున్నట్లు కలరింగ్ ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నారంటూ ఆపార్టీ నాయకులే బహిరంగంగా విమర్శిస్తుండటం గమనార్హం. బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేసి ఈనెల 20వ తేదీన ట్రయల్‌రన్ నిర్వహించేందుకు ఆర్ అండ్‌బీ అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈనెల 20 తరువాత వాహనాల రాకపోకలను బ్రిడ్జిపై అనుమతించి చిన్న చిన్న పనులు మిగిలి ఉంటే వాటిని అతి త్వరలోనే పూర్తి చేస్తామంటూ అధికారులు చెబుతుండటం విశేషం. బ్రిడ్జి పనులు పూర్తయ్యే సమయంలో జనార్దన్ చేస్తున్న రాజకీయ డ్రామాలు ప్రజలందరికీ తెలుసని, చీప్ పాలిటిక్స్ చేస్తూ జనార్దన్ ప్రజల్లో మరింత చులకనవుతారని గుర్తించాలని పలువురు హెచ్చరిస్తున్నారు. కరోనాతో ఒంగోలు నియోజకవర్గ ప్రజలు అల్లాడుతున్నా వారి ప్రాణాలు పోతున్నా కనీసం స్పందించని జనార్దన్ ఎలక్షన్‌లు దగ్గర పడుతున్న సమయంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్నట్లు చూపించే కుయుక్తులకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా నియోజకవర్గంలో జరిగే అభివృద్ధికి ఆటంకాలు కలిగించకుండా నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించాలని ప్రజలు హితవు పలుకుతున్నారు.



నిర్మాణ పనులను పరిశీలించి అక్కడే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న బాలినేని (ఫైల్)



వంతెనపై తుదిమెరుగులు దిద్దుతూ ఫ్లోరింగ్ చేస్తున్న సిబ్బంది

కమీషన్లు దండుకొని రాజకీయ డ్రామాలా...



ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులోని బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్ వద్ద మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు దామచర్ల జనార్దన్ కమీషన్లు దండుకొని రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారు. 2016లో మంజూరైన బ్రిడ్జి పనులు టీడీపీ ప్రభుత్వంలో మూడున్నర సంవత్సరాలపాటు కమీషన్ల కోసం కాలయాపన చేస్తూ నిర్మాణ పనులను నిర్వీర్యం చేశాడు. కేంద్ర ప్రభుత్వ పథకానికి సంబంధించిన నిధులతో ప్రారంభమైన పనులు, ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం ఆ స్కీమును రద్దు చేసిన సంగతి తెలిసి కూడా జనార్దన్ ప్రజలను మభ్యపెట్టే పనులు చేపట్టడం ఏదో సానుభూతి పొందాలని తప్ప ప్రజలకు మేలు చేద్దామని కాదు. నిర్మాణ పనులు పూర్తవుతున్న బ్రిడ్జి వద్దకు వెళ్లి ఏదో నిరసన వ్యక్తం చేయాలని చూస్తున్నట్లు తెలిసింది. ఆయన హడావుడి చేసినందు వల్ల పనులు వేగంగా జరిగాయని బిల్డప్ ఇచ్చుకోవాలని చూస్తున్నాడు. అయితే నియోజకవర్గ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఈ నెల 20వ తేదీన ట్రయల్ రన్ పూర్తి చేసి అనంతరం బ్రిడ్జిపై నుంచే వాహనాల రాకపోకలు కొనసాగిస్తాం.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే, ఒంగోలు

సంక్షేమ ప్రభుత్వంగా

ప్రజల గుండెల్లో..



టీడీపీ నాయకురాలు దోసకాయలపాటి నాగమ్మకు పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- బాధల్లో ఉండే వారిని అక్కున చేర్చుకుంటున్న సీఎం వైఎస్ జగన్
- ఒక్క ఒంగోలులోనే కొత్తగా 727 పింఛన్లు మంజూరు
- జిల్లా వ్యాప్తంగా కొత్తగా 9,669
- 33వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధులకు నమస్కరిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఏకైక సంక్షేమ ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో బుధవారం 33వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయ భాస్కర రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముంగమూరు రోడ్డులోని శివ ప్రసాదు కాలనీ, ఆర్టీసీ కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన 3648 కిలో మీటర్ల ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకొని, కళ్లారా చూసినందు వల్లే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతుందన్నారు. బాధల్లో ఉండే వారిని అక్కున చేర్చుకుంటున్న సీఎం వైఎస్ జగన్ ప్రతి ఒక్కరి మదిలోనూ గుర్తుండిపోతున్నాడన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను రావాలంటే ఎవరో ఒకరు చనిపోతే కానీ కొత్తవాళ్లకు ఇచ్చేవారు కాదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అలా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను ఇవ్వాలన్న సంకల్పంతో ఉన్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శివప్రసాదు కాలనీలో టీడీపీ నాయకురాలు దోసకాయలపాటి నాగమ్మకు వైఎస్సార్ సీపీ కండువా వేసి బాలినేని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగమ్మ ఇంట్లోనే నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసిన బాలినేని అందరికీ పంచిపెట్టారు. అనంతరం పోలేరమ్మ దేవస్థానం వద్ద నూతనంగా పింఛన్లు పొందిన 18 మందికి బాలినేని పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా కుమారి అనే ఒంటరి మహిళ మాట్లాడుతూ తాను దరఖాస్తు చేసుకున్న వెంటనే ఒంటరి మహిళ పింఛను మంజూరు చేశారన్నారు. జీవితాంతం వాసన్నకు, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, వేమూరి భవాని, నీలంరాజు సరోజ, చింతపల్లి గోపీచంద్, ప్రవీణ్ కుమార్, ట్రేడ్ యూనియన్ నాయకులు జాజుల కృష్ణ, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్, గొర్రెపాటి శ్రీనివాస రావు, చింతగుంట్ల సువర్ణ, కొమ్మూరి రవిచంద్ర, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, అమ్మిశెట్టి ఆంజనేయులు, కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, ఉసా మధుబాబు, బైరెడ్డి అరుణ, తోటపల్లి సోమశేఖర్, గోలి తిరుపతి రావు, జే.పున్నయ్య, రావులపల్లి నాగేశ్వరరావు, నక్కల లీలా కుమారి, జిల్లెళ్లమూడి రమాదేవి, మైనార్టీ మహబూబ్ బాష, మీరావలి, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు పందిటి కాశీరామ్ (జేమ్స్), మిలిటరీ కాలనీ ఎస్‌కే నాగూర్, ఓగిరాల శ్రీనివాసులు, జయరామిరెడ్డి, కోటా రాంబాబు, నగేష్, ముంతాజ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రమాదేవి, మద్దులూరి వెంకటేశ్వర్లు, శోభ, ఏసు, బక్కా రోశయ్య, బాబూరావు, పింగల సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

10న ఒంగోలులో త్యాగరాజ ఆరాధనా మహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ నాయకులు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఒంగోలులో త్యాగరాజ స్వామి ఆరాధనా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిల్లుట్ల సుధాకర రావు తెలిపారు. స్థానిక కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద త్యాగరాజ స్వామి విగ్రహం వద్ద మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. త్యాగరాజ విగ్రహం వద్ద నుంచి మంగళ వాయిద్యాలతో నగర సంకీర్తన జరుగుతుందని, అనంతరం కాపు కల్యాణ మండపంలో నాదస్వరాలు, డోలు, ఆరు బృందాలతో నాదనీరాజనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ డోలు విద్వాంసుడు నిడమనూరి లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాచవరపు రామాంజనేయులు, గుంటూరు సత్యనారాయణ, మద్దులూరి శ్రీనివాసరావు, డాక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ కానుక

- జిల్లాలో 2,86,075 లక్షల మందికి రూ.79.41 కోట్ల ప్రయోజనం
- కలెక్టర్ దినేష్‌కుమార్



లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

ఒంగోలు అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక అందిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. పెన్షన్ పథకంలో భాగంగా పెంచిన నగదుతో కలిపి లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో మంగళవారం రాజమండ్రిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. దీనికి అనుబంధంగా ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, సాంప్రదాయ చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఇప్పటి వరకు ఇస్తున్న పెన్షన్‌కు రూ.250 అదనంగా పెంచిన మొత్తాన్ని కలిపి నెలకు రూ.2750 ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులకు అందచేస్తామన్నారు. ఈ పెన్షన్ పెంపుతో జిల్లాలో 2,45,165 మంది లబ్ధిదారులకు రూ.67.42 కోట్ల మేరకు ప్రయోజనం కలిగిందన్నారు. పెన్షన్ పొందేందుకు అర్హులను ప్రతి ఆరు నెలలకు గుర్తించి ఆర్థిక ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. ఈ క్రమంలో గత నెలలో కొత్తగా 9103 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. జిల్లాలో అన్నీ కేటగిరీల్లో కలిపి 2,86,075 మందికి రూ.79.41 కోట్లను ఈ నెలలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2019 జూన్ నుంచి 2022 వరకు మొత్తం రూ.2977.50 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. తొలుత సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి కలెక్టర్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షన్ పెంపు వివరాల గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండోలో రైజ్ విద్యార్థి ప్రతిభ

ఒంగోలు: స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణ సాయి ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి బి.సాయి వెంకట మౌనిష్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో గత నెల 24, 25వ తేదీల్లో నిర్వహించిన ఐటీఎఫ్ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో 65 కేజీల గ్రీన్‌బెల్ట్ విభాగంలో మౌనిష్ ప్రతిభ కనబరిచాడని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు తెలిపారు. రైజ్ కళాశాలల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ తదితరులు అభినందించారు.



మౌనిష్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చంద్రబాబు సభల్లో నిరుపేదలు మరణిస్తున్నారు

- మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

ఒంగోలు టౌన్: చంద్రబాబు సభల్లో నిరుపేదలు మరణిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుస్తులు, బంగారం ఇస్తామని ఆశలు పెడితే పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడం సహజమేనని వ్యాఖ్యానించారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరు, గుంటూరు సభల్లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. పేదలకు లేనిపోని ఆశలు కల్పించడం సరికాదన్నారు. భారీ సభలు ఏర్పాటు చేసినప్పుడు అందుకు తగిన జాగ్రతలు కూడా తీసుకోవాల్సి ఉంటుందని హితవు పలికారు. ఎన్టీఆర్ సభలకు కూడా లక్షల సంఖ్యలో జనాలు తరలి వచ్చారని, కానీ ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదని గుర్తుచేశారు. 14 ఏళ్లపాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు పరిపాలనను ప్రజలు చూశారని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. ఎంతసేపూ సైబరాబాద్ గురించి మాట్లాడే చంద్రబాబు తన పాలనలో ఒంగోలు, గుంటూరు జిల్లాల అభివృద్ధికి ఏమి చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లపాటు గ్రాఫిక్‌లతో కాలం వెళ్లబుచ్చాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మీద ప్రజలకు ఎలాంటి నమ్మకం లేదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌తోనే తెలుగుదేశం పార్టీకి క్రేజ్ పోయిందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నీ విధాలుగా విఫలమైందని, ప్రధాని మోదీ దేశానికి చేసింది శూన్యమని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో దళిత నాయకులు పాలడుగు విజయేంద్ర, శ్రీపతి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిమెంట్ లారీ బోల్తా



నికరంపల్లి వద్ద రోడ్డుపై పడిన లారీ

మార్కాపురం: మాచర్ల నుంచి మార్కాపురానికి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ మంగళవారం సాయంత్రం జాతీయ రహదారిపై మండలంలోని నికరంపల్లి వద్ద బోల్తా పడింది. రోడ్డుపై సిమెంట్ బస్తాలు చెల్లాచెదురుగా పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్సై సుమన్ పరిశీలించారు. సిమెంట్ బస్తాలను పక్కకు తీయించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. లారీ బోల్తా పడిన సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

108లో కవలల జననం



108లో చేసిన కాన్పులో జన్మించిన కవల పిల్లలతో తల్లి, బంధువులు

పామూరు: 108 వాహనంలో కవలపిల్లలు జన్మించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అయ్యన్నకోట ఎస్సీకాలనీ, గుంటగాని వైష్ణవి సోమవారం రాత్రి పురిటినొప్పులు వచ్చాయి. 108కు ఫోన్ చేయగా వెంటనే సిబ్బంది అయ్యన్నకోట చేరుకుని వైష్ణవిని ప్రసవ నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలిస్తున్నారు. మార్గమధ్యంలో పోకూరు వద్దకు వెళ్లే సరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ మల్కాపురం నారాయణ, పైలెట్ టి.వెంకటనారాయణలు వైష్ణవికి చాకచక్యంగా సుఖప్రసవం చేయగా ఆమెకు ఆడ కవలపిల్లలు జన్మించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కందుకూరు ఏరియావైద్యశాలకు తరలించారు. 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

పింఛను సంబరం

వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పింఛను నగదును ఏటా పెంచుతామని గత ఎన్నికల వేళ మేనిఫెస్టోలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఈ నెల రూ.2750 అందజేయడంతో అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం నూతనంగా పింఛను మంజూరు చేయగా.. సంబంధిత పత్రాలను వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అవ్వాతాతలు ఆశీర్వదించారు. - సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు శివప్రసాద్ కాలనీలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టివేణుగోపాల్



మార్కాపురంలో పింఛనుదారులతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



పామూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



సింగరాయకొండలో పింఛన్లు అందజేస్తున్న అశోక్‌బాబు



ఎస్ఎన్‌పాడులో ఎంపీపీ, జెడ్పీటీసీతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

బాలినేనిని కలిసిన ఎస్పీ మలికాగర్గ్



బాలినేనికి శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం స్థానిక ఎస్పీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

6 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మేదరమెట్ల: ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, ప్రకాశం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు భ్రమర గ్రోత్‌సిటీ-మేదరమట్ల వెంచర్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం కబడ్డీ పోటీల బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో హైద్రాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, తూర్పు గోదావరి, కృష్ణా తదితత ప్రాంతాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు, నాలుగో బహుమతిగా రూ.25 వేలు, అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్ర భాస్కరరావు, ఉపాధ్యక్షుడు గోపాల్‌రావు, ట్రెజరర్ దాసరి రమేష్, కోఆర్డినేటర్ పతంగి ఆంజనేయులు, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆదేశాలు శిరసావహిస్తాం

- పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఆమంచి



ఆమంచి కృష్ణమోహన్ (ఫైల్)

పర్చూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు శిరసావహిస్తామని ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. గత కొద్ది రోజులుగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నియోజకవర్గ ఇన్‌చార్జులుగా మార్పులు చేర్పులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పలుమార్లు ఆమంచితో పాటు రావి రామనాథంతో చర్చించి ఆమంచికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. దీంతో పర్చూరులో కాపు సామాజిక వర్గంతో పాటు పార్టీకి కొత్త వైభవం వచ్చే అవకాశం ఉంది. ఆమంచి సీనియర్ నాయకుడుతో పాటు ఆయన కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా చీరాల నియోజకవర్గంలో గెలిచారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ పర్చూరును మొదటిసారిగా పార్టీ గెలిచేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించి సమన్వయం చేసుకుని గెలుపు దిశగా ముందుకు వెళ్తామన్నారు. నియోజవకర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఆమంచి కృష్ణమోహన్ పేరు కొద్ది రోజులుగా వినిపిస్తోంది. ఇందుకు సంకేతంగానే నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గంలోని మండలాల నుంచి పలువురు పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు ఆమంచిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరావు (ఫైల్)



చెరువు నుంచి బయటకు తీసిన వెంకటరావు మృతదేహం

ఒంగోలు టౌన్: నగర పరిధిలో రెడ్డి హాస్టల్ సమీపంలో మామిడిపాలెం చెరువులో పడి వ్యక్తి అనుమాస్పదస్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మామిడిపాలెం లోని కృష్ణుడి దేవాలయం వద్ద నివసించే కొల్లిబోయిన వెంకటారావు(57)స్థానిక కేంద్రీయ విద్యాలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తూనే కొత్తమామిడిపాలెం వద్ద ఉన్న పోలేరమ్మ గుడిలో పూజారిగా చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన వెంకటరావు సాయంత్రానికి ఇంటికి రాలేదు. పోలేరమ్మ గుడి వద్ద సైకిల్ ఉండడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు మామిడిపాలెం చెరువు గట్టుపై కనిపించినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో చెరువు పరిసరాల్లో వెతికారు. హైవే వైపు గట్టు మీద చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. చెరువులో వెంకటరావు మృతదేహం కనిపించింది. చీకటి పడడంతో మంగళవారం ఉదయం రెస్క్యూ టీం సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తాలుకా ఎస్సై కె.అంకమ్మరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కూతురికి వివాహం కాగా ఆమె ప్రస్తుతం బెంగుళూరులో ఉంటుంది.

అమ్మ మీద దిగులుతో...

వెంకటరావుకు సౌమ్యుడని పేరుంది. ఇంట్లో భార్యాభర్తలు కూడా ఎంతో అన్యోన్యంగా ఉంటారని ఇరుగుపొరుగు చెబుతున్నారు. అయితే వెంకటరావుకు 90 ఏళ్ల వయసు కలిగిన తల్లి అంజమ్మ అంటే ఎనలేని ప్రేమ. అమ్మను వదిలి ఉండేవాడు కాదు. అలాంటిది గత డిసెంబరు 5వ తేదీన అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి వెంకటరావు దిగులుగా ఉంటున్నాడు. నాలుగు రోజులుగా గుడికి కూడా వెళ్లడం లేదు. అదే దిగులుతో ఉన్న వెంకటరావు ఇలా చెరువులో మృతదేహమై కనిపించే సరికి ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

పోలీస్ స్టేషన్‌లో యువకుడు హల్‌చల్

- పలు కేసుల్లో నిందితుడు కావడంతో బైండోవర్
- సెట్ టవర్ ఎక్కి పోలీసులనే బెదిరించిన వైనం



పోలీసు స్టేషన్ ఆవరణలోని సెట్ టవర్ ఎక్కిన యువకుడు

టంగుటూరు: కోడి పందేల నిర్వహణ, అక్రమంగా మద్యం విక్రయించిన కేసుల్లో పలుమార్లు పట్టుబడిన యువకుడిని పోలీసులు స్టేషన్‌కు పిలవగా.. సెట్ టవర్ ఎక్కి హల్ చల్ చేసిన ఘటన మంగళవారం టంగుటూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టంగుటూరు పురం సెంటర్‌కు చెందిన బలగాని కిషోర్ కోడి పందేలు, అక్రమ మద్యం విక్రయిస్తుంటాడు. గతంలో అతనిపై కేసులు కూడా ఉన్నాయి. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడి పందేల నిర్వహించకుండా నిందితులను బైండోవర్ చేస్తున్న క్రమంలో కిషోర్‌తోపాటు మరో వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించారు. సింగరాయకొండలో సీఐ సమక్షంలో బైండోవర్ చేసి మధ్యాహ్నం ఒంటి గంటకు టంగుటూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో పోలీసుల కన్నుగప్పిన కిషోర్.. స్టేషన్ ఆవరణలోని సెట్ టవర్ ఎక్కి దూకేస్తానని బెదిరించాడు. సీఐ రంగనాథ్, ఎస్సై ఖాదర్‌బాషా రంగంలోకి దిగి యువకుడికి నచ్చజెప్పడంతో కిందకు దిగాడు.

15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొత్తపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 15, 16 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయి స్థాయిలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్ర్సీ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సారధ్యంలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.లక్షను బాలాజీ, రెండో బహుమతి రూ.50 వేలను చెరుకూరి వీరరాఘవరావు, మూడో బహుమతి రూ.40 వేలను యలగాల నారాయణ, నాల్గవ బహుమతి రూ.30 వేలను పాలేటి ఆంజనేయులు, ఐదో బహుమతి రూ.20 వేలను ఎంపీటీసీ సభ్యురాలు గుడి అరుణ-నాగిరెడ్డి, ఆరో బహుమతి రూ.15 వేలు జజ్జర హరినారాయణ, ఏడో బహుమతి రూ.12 వేలు పాకల చిరంజీవి, ఎనిమిదోవ బహుమతి రూ.10 వేలు పాదర్తి సర్పంచ్ కట్టా సౌంధర్య-శేఖర్, తొమ్మిదో బహుమతి రూ.8 వేలు పంట్రంగం బ్రహ్మయ్య అందజేస్తారన్నారు. పోటీల అనంతరం 16వ తేదీ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 7708169765, 9866729559 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సస్యరక్షణ చర్యలతో లాభాలు

పీసీపల్లి: సాగు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ అన్నారు. స్థానిక ఆర్‌బీకే కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాగు ఖర్చు ఎలా తగ్గించుకోవాలనే అంశంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సేంద్రియ, జీవన ఎరువుల వాడకం ద్వారా సాగు ఖర్చు తగ్గి, అధిక లాభాలు పొందవచ్చన్నారు. పచ్చిరొట్ట పైర్ల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. శనగ, కంది, ప్రత్తి, మినుము, వరి ,మిరప పంటలతో ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శిక్షణలో భాగంగా రైతుల మిరప, కంది చేలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం కనిగిరి ఏడీఏ ఈవీ రమణ పంట నమోదు, పంట బీమా గురించి తెలిపారు. గత ఏడాది ఖరీఫ్‌లో పంట బీమా అందని 26 మంది రైతులు పంట బీమా అందజేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించి పీడీ సదరు అధికారుల నుంచి నివేదిక తెప్పించుకొని మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వి.శేషము, పీసీపల్లి వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి, పీసీపల్లి సర్పంచ్ టి.మరియమ్మ, మండల కన్వీనర్ జి.బొర్రారెడ్డి, మారెళ్ల సర్పంచ్ పరిమి వెంకట్రావ్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



పెద్దశేషయ్య(ఫైల్)

యర్రగొండపాలెం: మండలంలోని గడ్డమీదిపల్లె గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు మందుల పెద్దశేషయ్య(105) మంగళవారం వృద్ధాప్య కారణాలతో మృతి చెందారు. వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు తండ్రి పెద్దశేషయ్య 1917లో జన్మించారు. ఆయన 1987 నుంచి మూడేళ్లపాటు వీరభద్రాపురం పంచాయతీ సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపే ఆయన ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండేవారని గ్రామస్తులు చెప్పారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ జబీవుల్లా, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, వైఎస్సార్ క్రీడా వికాసం కమిటీ అధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, సర్పంచ్ ఆర్.అరుణాబాయి తదితరులు సంతాపం తెలిపారు.

1.750 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్టు చూయిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయి

కనిగిరి రూరల్: గంజాయి విక్రయదారులపై దాడులు నిర్వహించి సుమారు 1.750 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్‌కే అబ్దుల్ తెలిపారు. సెబ్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం... కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనపకాయల గోందిలో దాడులు నిర్వహించి అక్కడ గంజాయి విక్రయాలు చేస్తున్న నాగులూరి కోటయ్య అదుపులోకి తీసుకోని అతని దగ్గర సుమారు 500 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారున్ని విచారించగా అతనిచ్చిన సమాచారం మేరకు అయ్యప్పరాజుపాలెం లోని చెక్క కోటయ్య, కందుకూరులోని గురనాథం సిద్ధయ్య వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకొని చెక్క కోటయ్య దగ్గర 450 గ్రాములు, గురునాథ సిద్ధయ్య దగ్గర 800 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్సై, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ బంగ్లాను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

కనిగిరి రూరల్: ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న మంగళవారం కనిగిరిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లాను ఆర్డీఓ కార్యాలయానికి కేటాయించాలని అధికారుల విన్నపం మేరకు ఆయన విజయవాడ వెళ్తూ మార్గ మధ్యంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ కార్యాలయం , ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ఏఎంసీ కార్యాలయానికి వచ్చిన ప్రిన్సిపల్ సెక్రటరీనీ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందచేశారు. పామూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొత్త ముద్దపాడు వయా కలగట్ల రోడ్డును నిర్మించాలని కొరినట్లు చెప్పారు. అర్‌అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం, ఈఈ వై నాగేశ్వరరెడ్డి, జేఈ రఫీ, ఆర్డీఓ సందీప్‌కుమార్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి, తహసీల్దార్ యు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కొండపి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గోగినేని శారద



గోగినేని శారద, కొండపి ఏఎంసీ చైర్‌పర్సన్

కొండపి: కొండపి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా కొండపి మండలం గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన గోగినేని శారదను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ వైస్ చైర్మన్‌గా మాలే రంగారెడ్డితో పాటు కమిటీ సభ్యులుగా పాలెపు పద్మ, గుమ్మళ్ల రమాదేవి, పల్లాల శివకోటయ్య, టి.రామకృష్ణ, కొమ్ము సురేంద్ర, సీహెచ్ అంజమ్మ, డి.మనీష, కె.రమణయ్య, షేక్ రసూల్, తన్నీరు బ్రహ్మయ్య, కె.శ్రీరంగనాయకులు, మున్నంగి స్వర్ణలత, పి.శ్రీనివాసరావు నియమించింది. వీరితో పాటు జరుగుమల్లి సొసైటీ అధ్యక్షులు, వ్యవసాయశాఖ మార్కెటింగ్ అధికారి, సింగరాయకొండ ఏడీఏ, సింగరాయకొండ గ్రామ సర్పంచ్‌ను సభ్యులుగా నియమించింది. నూతన ఏఎంసీ చైర్మర్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా తనపై నమ్మకం ఉంచి పదవి కేటాయించేందుకు కృషి చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కొండపి సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.